

# * (నా) భారతి *

రచన: "రవికాంత్"

మాకాలేజీ అంతా అదొకతరహా; అది నిజంగా విద్యాసంస్థకాని అన్నిటికి సదుపాయంగా వుంటుంది. దానిలో విద్యాబోధన ఎలాగున్నా, అమ్మాయిలున్నారు కాబట్టి, అందులో మంచి అందమయిన అమ్మాయిలు. అందువల్ల చాలామంది చేరుతారు ఆ కాలేజీలో. ఇంక చదువు నేర్చుకుందికి చాలా విధానాలున్నాయి. ముఖ్యంగా యిప్పుడుమరీ సదుపాయంగా వున్నదేమిటంటే, కావలసిన మాష్టరు వద్ద, ఏదో ఒకగుంపు విద్యార్థులతో తన వీలును బట్టి వెళుతూవుంటే, ఆ చెప్పేదేదో తన చెవులకు కూడా, నలుగురితోపాటు, తగులుతుంది. దానివల్ల ముఖ్యంగా చదువునేర్చుకుందికి కాలేజీకి వెళ్లెబాధ లేదు. ఇంతకంటే ఎక్కువగా నే చెప్ప కూడదు. ఎందువల్లనంటే మొన్నటి వరకు నేను విద్యార్థినే అయినా, యిప్పుడు హెూదా హెచ్చింది. కాని వాక్స్వాతంత్ర్యం, రచనాస్వాతంత్ర్యము బందయినాయి. నేనిప్పుడొక లెక్చరర్ అయినా యింకా విద్యార్థినే అనుకొని (కొంతవరకు) రాస్తాను.

నేను చదువుతున్నప్పుడు ముచ్చటగా ముగ్గురమ్మాయిలుండేవారు. సుశీ, భారతి, శశి ముగ్గురిపేర్లూను. అందులో ఒక అక్షరం ఎక్కువవున్న అమ్మాయి మిగతా యిద్దరికన్నా అందంలో కూడా కాస్త ఎక్కువే. అందుకే మరినాకుకూడా మిగతా విద్యార్థులను చూచయినా, ఆమెవేపు కొంచెం చూడాలని బుద్ధి పుట్టింది. అసలు స్వతహా నాకు ఆడవాళ్లతో పరిచయం అట్టే యిష్టంలేదు, తరచితరచి వాళ్లవేపు చూడలేనుకూడా. యిలా ఆడవాళ్ల కోసం బాధపడే వ్యక్తుల్లో మూడురకాల వాళ్లున్నారనుకుంటాను. కొంతమంది మాట్లాడితే చాలు, ఉద్యోగస్థుడు కొత్తగాతన మొదటి నెల జీతం పుచ్చుకొనే రోజున పొందే సంతోషాన్ననుభవిస్తారు. మరొకరు తమవేపు చూస్తేచాలు ఎయిర్ కండిషన్ రూమ్‌లో వున్నట్లు ఫీలవుతారు. యిక మూడవరకం తమతోమాట్లాడకపోయినా, తమవైపు చూడకపోయినా, వారుండే వీధిలో ఆమె కూడా నివసిస్తూ యుంటే చాలు. ఆమె ప్రక్కనున్నట్లే అనుకుంటారు. అయితే యింతకీ పయి మూడిటిలో నేను మాత్రం ప్రథమ శ్రేణికి చెందిన వాడినే, అలాగని, ఇదేమిటమ్మా! అలుసిస్తే చొరవ ఎక్కువనుకునే రకం మాత్రం కాదు. నేను వేరే ఒక చిన్న గదిలోవుంటూ మా కాలేజీ ప్రక్కనేవున్న హెూటల్లో భోజనంచేస్తూ యుండేవాడిని. అదేమివిశేషమో రోజూ నేను భోజనంచేసి వచ్చేవేళకి ఆ అమ్మాయి అంటే భారతి, కాలేజీకి వెళుతుండేది; అందుచేత చూపులు కలియక తప్పేవికావు. ఎలాగయితేనే మరి నాగురించి ఎవరినైనా అడిగి తెలుసుకుందో ఏమో ఒకనాడు తనకి కావలసిన నోట్సు నన్నడిగింది. నేను లేదనకుండా ఆమెకిచ్చాను, కొన్ని నాదగ్గర లేకపోయినా నాస్నేహితుల నడిగి తెచ్చి. యీ విధంగా రోజూ కలిసికొని చాలా సేపు మాట్లాడుకొనేదాకా వచ్చింది మా కథ.

ఆ మరుచటి సంవత్సరమే (అంటే యిప్పుడు నేనున్న పరిస్థితి) నేను బాగా ప్యాసు కావడంవల్ల ఆ కాలేజీలోనే లెక్చరర్ పోస్టు కాళీగావుంటె అందులో నేను చేరాను. ఆ అమ్మాయే నాప్రథమ విద్యార్థి బృందంలో విద్యార్థిని కావడం జరిగింది (యింకా అమ్మాయిలున్నారనుకొండి వారంత ముఖ్యమయిన వారుకారు) ఏమయినా అనుమానముంటే అక్లాసయిపోయాక నన్నుకల్సుకొని అనుమానం తీర్చుకొనేది. యిలా మా పరిచయం వృద్ధిఅయి ఉచ్చస్థాయిలో కొచ్చింది.

నెల జీతం అందుకున్న రెండవ రోజున షాపింగ్‌కని బయలుదేరాను. తీరా అషాపులో భారతి అప్పటికప్పుడే చాలా బట్టలు తీయించి పేక్ చేయించింది. నన్నుచూచి విష్ చేసిన తర్వాత తన స్నేహితురాలు పెళ్లికి ప్రజంట్సు కొంటున్నానని ఆమె నాతో చెప్పింది. దాదాపు ముప్పయిరూపాయిల బట్టలు తీయించి, కౌంటర్ దగ్గర పర్సు విప్పి చూచి నా వేపు కంగారుగా చూచింది. సంగతేమిటంటే ఆమె సరిపడ్డ డబ్బు పట్టుకొని వచ్చానను కొందిట. తీరా

చూస్తే పదే రూపాయ లున్నాయి. సరేనని మిగతా యిరవై రూపాయలు నేను అఫర్‌చేసాను. వద్దంటూ, మొహమాట పడుతూ నేనిచ్చాననో, మరితప్పని సరైన అవుసరమనో తీసుకుంది చాలాథాంక్స్ మాస్టరూ, మంచిసమయానికి దేముడిలా వచ్చేరు అంటూ చిరునవ్వుతో షాపు నుండి బయటపడ్డాది. తీరా షాపింగ్ కని బయలుదేరిన వాడిని యిదంతా అయేటప్పటికి హొటలుకి టయిమయిందని బయలుదేరాను.



ఆరోజు కాలేజీలో వరకట్న నిషేధం విషయం మీద సభజరిపేరు. అందులో కొంతమంది విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అహ్వానించిన వుపాధ్యాయుల్లో నేకూడా వున్నాను, నాకు నిజంగా వెళ్లడానికి యిష్టంలేదు కాని విద్యార్థినుల ప్రత్యేకాహ్వానం మీద తప్పలేదు. సరే ఒకపావుగంట నాది కాదనుకొని, నాకు తెలిసినంత మట్టుకు మాట్లాడేను. మర్నాడు క్లాసయి వెళ్లిపోతున్నప్పుడు అ అమ్మాయి నన్ను కల్సుకొని నిన్న మీటింగులో చాలా బాగా మాట్లాడేరని అభినందించింది. అలాంటి సమయంకోసం ఎదురు చూస్తున్ననాకు ఏంమాట్లాడాలో తోచ లేదు కాని, అ అవకాశం మళ్లీకలుగుతుందో లేదోనని నాలో నేను తమాయించుకొని అ౽ లేదండి, ఏదో మాట్లాడేను. ఆ మాట్లాడింది, హృదయ పూర్వకంగా వచ్చిందే కాని, "వారానికి అథమం ఒకసారైనా అత్తవారింటికి పోతూ, వెళ్లినప్పుడల్లా ఏ చిన్న రిష్టువాచిలాటి కట్నాన్నో సాధించుకొంటూ, వరకట్న నిషేధసంఘానికి కార్యదర్శిగాను, లేక అధ్యక్షునిగానో వుంటానని" అనే తరహా మనిషిని కానండి. యింతకీ నేను మన స్ఫూర్తిగా చెప్పేదేమిటంటే, నిజంగా నావంతువస్తే మీకేతెలుస్తుందిగా కట్నం పుచ్చుకొంటానో లేదో, కొండంత బరువు తగ్గింది మనసులో, ముఖ్యంగా నాకింకా పెళ్లి కాలేదని, అ చేసికొనేది ఎవరినో అనే వుద్దేశం బయట పెట్టాను కదా అని చాలా సంతోషించాను. అవన్నీ కట్నాలేందుకవుతాయండి, అల్లుడిగారి ముఖ్యావసరాలని అత్తవారిచ్చే రనుకో కూడదూ అన్నదామె. అవునవునన్నా యిదే నా విషయంలో కూడా వర్తించ వచ్చునని.

తర్వాత రోజున భారతియింటికి వెళ్లిపోతూ కాలేజీలో నారూముకు వచ్చి మాష్టారూ! ఒక మాట అంది. ఏమిటన్నా. అ౽ ఏమీలేదు రేపు మీకే మీ ప్రోగ్రాం లేకపోతే బీచికి వస్తారేమో

అక్కడ మీకొక ముఖ్యమయిన అంతరంగిక విషయంచెప్పాలి. అది అయాక మొదటి ఆట సినిమా కెళదామంది. తప్పకుండా వస్తానన్నా. యింతకీ ఏమిటబ్బా!ఆ విషయం అని ఆలోచిస్తున్నా. మీకభ్యంతరం లేకపోతే ఒక్కరేరండని చెప్పింది. యింకేం నా మనస్సులో కోరిక అపళంగా బయటపడి ఒక్క నిముషంలో చెట్టయి, కాయలు కాసి పండయి ఫలించబోతూంది, అందుచేత రోజూకంటె ముందర రూముకి పోయాను సంతోషంలో సామాన్యంగా వేసేయీాల పాటతో.

మొదటినుండి నా మిత్రులు నన్నూ భారతిని అనుమానంగా చూస్తూ ఏదో అనుకుంటూనే వున్నారు అసహనంతో. యీారోజున వారందరికి మరింత అసూయ కలిగేలా యీా సంగతి కూడా వారికి చెపుదామనిపించి చెప్పేను. యిక నేం! శుభ్రంగా తెల్లని బట్టలువేసుకుంటే చాలు టీపార్టిఅడిగే యీా రోజుల్లో ఇంత గుడ్‌న్యూస్‌కి వూరుకుంటారా! సాయంత్రం 4 గంటలకి వాళ్ల ముడుపు తీరేక త్వరత్వరగా రూముకిపోయి ట్రిమ్‌గా బ్లూట్వీడ్ పాంట్‌లో వైట్‌షర్టు టిక్‌చేసి బయలుదేరా బీచికి.

తీరా అమె చెప్పిన చోటుకి పోయేసరికి అక్కడే ఒక నవయువ ఢంపతులనుకుంటాను ఇద్దరున్నారు. ఏదో మాట్లాడు కుంటూన్నంత దగ్గరలో కూర్చుని, ఆమె కిలకిలా నవ్వుతుంటే అతను ఆనవ్వుకు శ్రుతికలుపుతున్నాడు. నేను కొంచెందూరంలో వుండడంవల్ల ఆమె నావేపు వుండి వుండి చూస్తూన్నా సరిగా ఆమెఎవరో తెలిసికోలేక పోతున్నాను కాని ఆమె చాలా అందంగా వుందని, కొంచెం భారతి పోలికవున్నదని చెప్పగలను. ఒక పావుగంట చూచిన తర్వాత ఆమెఇక్కడికి యింకా రాలేదా? లేక వీరు యిక్కడవున్నారని మరొకచోటు నాకోసం నిరీక్షిస్తున్నదా అని ఆలోచిస్తున్నా. మాష్టారూ! అని నా ఆలోచనకు బ్రేకువేసే పిలుపు వెనుక నుండి వినిపించింది. తీరా చూడగా (నా) భారతే మరెవరో యువకునితో చేయికలిపి నా ఎదురుగా నిలబడింది. మాష్టారూ! మీరేనా యింకా రాలేదేమో అని అనుకుంటుండగా మీరు వెనుకకు తిరగగానే పోల్చి పిలిచాను, యింతసేపు ఉపేక్షించినందుకు క్షమించండని అంది. అప్పుడే నా కరికాలుమంట నెత్తికెక్కుతున్నాది, మనసు పరి పరి విధాలు పోతున్నాది. యీాయనే, అప్పుడు నీతో చెప్పేనుగా మంచి అవసరానికి హెల్ప్ చేశారని ఆ షాపులో, యీాయన మా లెక్చరరుగారు. నేనంటే మంచి అభిప్రాయంవుంది అనేమేమో చెపుతూ, అన్నట్లు! మరిచేను మాష్టారూ, యితనే మా బావ, ఫైనల్ ఎమ్. బి. చదువుతున్నాడు. అవునండీ యీా శలవుల్లో మేము ఒక యింటి వాళ్లమవుదా మనుకుంటున్నాము అని అతనన్నాడు. యీా సంగతి ముందుగా మీకుచెప్పి, మీ ఆశీర్వచనం పొందుదామని రమ్మన్నా నన్నది.

ఆ దృశ్యం చూస్తూ ఆ మాటలు వింటుంటే నా కెలావుంటుందో మీరే నిర్ణయిస్తారా లేక నా రక్తపు పోటు జీరోకి పోయినంత పనయిందంటేను, అతి సంతోషంగా చంద్రలోకయానం చేదామని స్పుత్నిక్ లో బయలుదేరి మధ్యలో దానికి నిప్పంటుకుంటే కలిగే అనుభూతి కలిగిందంటే నమ్ముతారా! మీరే నిర్ణయించండి. మాష్టారూ అని మళ్లీ అనగానే ఏమనాలో నాకుతోచ లేదు. అన్నట్లు ఆ "నిరాశ" సినిమా కెళదామా అంది. అదే నాడో చూచానమ్మ, అదీకాక నాకు చాలా అనుభవంకూడా అయింది, యింక దానికి మరిరాలేను. మీరు కావలస్తే పోయిరండని తిరుగు ముఖం పట్టి కాస్త కాఫీ మాత్రంతాగి రూముకుచేరుకున్నా. దినచర్య ప్రకారం రోజూ కాలేజీకి వెళుతున్నా, వస్తున్నా కాని నాసెక్షనులో అమ్మాయిలున్నారో లేదో కూడా నాకు తెలియదు యిప్పుడు.

★


## ఓట్టో లీలా సెంటు

ఎల్లప్పుడును మీరు మనస్సంతోషముగా ఉండవలయునన్న మా సెంటును ఉపయోగించవలయును. మీరు ఎన్నో సెంట్లను చూచియుందురు. ఈ సెంటును మీరు కొంచం చేతిగుడ్డకైనను, షర్టుమీదనైనను పూసిన మీరు ఆనందించుటయే కాక మీ ప్రక్కనవుండు వారందరు వాసన చూచి ఆనందింతురు. ఒకతూరి తీసి వాడినవారికి దీనిగుణము తెలియును.

డ్రామ్ బాటిల్ 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నం. 1376 — మదరాసు-1.

## కాలు ఆణి మందు

కాళ్లలో యేర్పడు ఆణికి యీా దివ్యమైన ఔషధమును ప్రతిరోజు పైన చరుముకొని వచ్చినచో ఆణియొక్క మొలకను బయటికి తీసివైచి స్వస్థపరచును. మరల యెప్పటికిని కాలిలో ఆణి రానేరదు. బాగుగ మామూలు ప్రకారము పాదములు అణచి నడచుటకు వీలుపడును.

బుడ్డి 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్‌పెట్టె నెం. 1376, మదరాసు-1.

424